క్లుప్తంగా

108లో మహిళ ప్రసవం


తల్లి, బిడ్డతో 108 సిబ్బంది

దొనకొండ: మండలంలోని కొచ్చెర్లకోట పంచాయతీ పరిధి కట్టకిందపల్లికి చెందిన మహిళ మంగళవారం 108లో సురక్షితంగా ప్రసవించింది. వివరాలు.. కట్టకిందపల్లి గ్రామానికి చెందిన ఎం.కోటేశ్వరి డెలివరీ నొప్పులతో బాధ పడుతోంది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఆమెను దొనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొస్తున్నారు. రుద్ర సముద్రం గ్రామానికి వచ్చేలోపు నొప్పులు పెరిగి పండంటి బిడ్డను సురక్షితంగా ప్రసవించింది. వారి కుటుంబం 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపింది. ఈఎంటీ పి.వెలుగొండయ్య, పైలట్ చెన్నారావును ఓఈ రాజేంద్రప్రసాద్, డీఎం విజయ్‌కుమార్ అభినందించారు.

ముళ్లకంప మధ్య విద్యార్థుల టాయ్‌లెట్లు


పీవీపల్లిలో విద్యార్థుల టాయ్‌లెట్లు

పుల్లలచెరువు: మండలంలోని పిడికిటివానిపల్లి జెడ్పీ పాఠశాలలో విద్యార్థుల టాయ్‌లెట్లు ముళ్లపొదల మధ్య ఉన్నాయి. విద్యార్థులు నిత్యం టాయిలెట్ల కోసం వెళ్లాలంటే భయంభయంగా వెళ్లి రావాల్సిన పరిస్థితి. అక్కడ ఏం విష పురుగులు ఉంటాయోనని భయం ఉంటుందని విద్యార్థులు పేర్కొంటున్నారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్త చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ముళ్లపొదలను తొలగించాలని విద్యార్థులు కోరుతున్నారు.

విద్యుదాఘాతానికి వానరం బలి



దర్శి: విద్యుదాఘాతానికి వానరం మృతి చెందింది. ఈ సంఘటన పట్టణంలోని వాసవి నగర్‌లో మంగళవారం సాయంత్రం జరిగింది. ఇతర వానరాలతో ఆడుకుంటూ ఓ కోతి ఆడుకుంటూ విద్యుత్ మెయిన్‌లైన్ తీగలపై దూకే క్రమంలో ఒంటికి తీగలు తగిలి వానరం అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు 40కి పైగా వానరాలు ఆ వానరం కళేబరం వద్దకు వచ్చి తమ బాధను పంచుకున్న సంఘటన చూసి స్థానికులు అయ్యో పాపం అంటూ తమ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ లోగా వీధిలో దీపావళి టపాసులు కాల్చడంతో కోతులు అక్కడి నుంచి వెళ్లిపోయాయి. కోతులను పట్టుకుని అడవిలో వదిలి పెడితే ఇలాంటి ప్రమాదాలు జరగవని ప్రజలు కోరుతున్నారు. వానరం కళేబరాన్ని తీసుకెళ్లాలని మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు.

ఆశాల సమస్యలు పరిష్కరించాలి


డాక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

కురిచేడు: ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు ఫిబ్రవరిలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు జీఓ విడుదల చేయాలని సీఐటీయూ మండల గౌరవాధ్యక్షుడు సందు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆశాడే సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రవితేజకు వినతిపత్రం ఆశా కార్యకర్తలతో ఇప్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు రాష్ట్ర వ్యాప్తంగా చేసిన పోరాట ఫలితంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆశా కార్యకర్తల నాయకత్వానికి జరిగిన చర్చల్లో కనీస వేతనాలు, రిటైర్మెంట్ వయసు 60–62కు పెంపు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, బీమా సౌకర్యం, ప్రమాద బీమా, ప్రభుత్వ సెలవులు, రికార్డులు వంటి ఒప్పందాలు జరిగాయి. ప్రభుత్వం ప్రజాపరిపాలన చేయాలని, వెంటనే కనీస కోర్కెలు అమలు చేయాలని కోరారు. లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆశా కార్యకర్తల మండల అధ్యక్షురాలు యూ.కొండమ్మ, కార్యదర్శి నాగమల్లేశ్వరి, యోగేశ్వరమ్మ, కృపమ్మ, గౌసియా, అంకమ్మ, రామకోటమ్మ పాల్గొన్నారు.

8 మంది జూదరుల అరెస్టు

కంభం: మండలంలోని పెద్దనల్లకాల్వ గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై నరసింహారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి దాడి చేశామని, నిందితుల నుంచి రూ.5540 స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం



పసుపుగల్లులో రోడ్డు పక్కన వేసిన చెత్త


ముండ్లమూరు మెయిన్ బజారులో చెత్త

- గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే
- మండల కేంద్రాల్లో మరీ దారుణం
- పట్టించుకోని అధికారులు, పాలకులు

తాళ్లూరు/ముండ్లమూరు (దర్శి): పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయింది. మండల కేంద్రాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. వర్షాకాలం రోగాలకు సీజన్ అయినా పారిశుధ్యంపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. మండల కేంద్రాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉంటోంది. చివరకు చెత్త తీసే బండ్లు కూడా చిల్లచెట్లలో ఉంచారు. ముండ్లమూరు మండల కేంద్రంలోని ముండ్లమూరు పంచాయతీ కార్యాలయం వద్ద చెత్త పేరుకు పోయింది. ఆ సమీపంలో ప్రాథమిక పాఠశాల కూడా ఉంది. చెత్త మొత్తం తీసుకొచ్చి అక్కడ వేయడంతో దోమలు ప్రబలి స్థానికులు నిద్ర లేని రాత్రులు గడుపుతున్నారు. దోమల కాటుకు గురై విషజ్వరాల బారిన పడుతున్నారు. గ్రామాల్లో జ్వరాలు దెబ్బకు ప్రజలు విలవిల్లాడుతున్నారు. ముండ్లమూరు ప్రధాన రోడ్డులో చెత్త రోడ్డుపైనే పోస్తున్నారు. నివాసాల్లో చెత్త మొత్తం తెచ్చి డంపింగ్ యార్డ్‌లో వేయకుండా రోడ్ల వెంట వేయడంతో గాలికి కవర్లు, చెత్త మళ్లీ నివాసాల మీదకు వెళ్లి ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తోంది. రోడ్ల పక్కన చెత్తను తీసి వేసి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

తాళ్లూరు మండలంలోనూ అంతే..

తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని ఎర్రవాగు వద్ద చెత్త, జంతు చర్మాలు, చికెన్, మటన్ దుకాణాల వ్యర్థాలన్నీ తీసుకొచ్చి అక్కడే వేస్తున్నారు. దీంతో బ్రిడ్జిపై నుంచి ప్రయాణికులు రాకపోకలు చేయాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఆ చెడు మాంసాలను శునకాలు తిని రాకపోకలు సాగించే వారిపై దాడులకు తెగబడుతున్నాయి. చెత్తను కాల్చడంతో పొగ కమ్ముకుని కాలుష్యం బయటకు వస్తోంది. ప్రయాణికులు, బాటసారులు, నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దగ్గరలోని రెడ్డి నగర్ వాసుల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. గాలికి ఆ వాసన గ్రామంలోకి వస్తోంది. ఒక్కోసారి భరించలేని కంపు వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. అక్కడ రోడ్డు పక్కన డంపింగ్ చెత్తను తొలగించి ఇబ్బందులు లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.


ఉల్లగల్లు వద్ద రోడ్డు పక్కనే ఉన్న చెత్త


ముండ్లమూరు పంచాయతీ కార్యాలయం ఎదుట..


చిల్లచెట్లతో కప్పేసిన చెత్తబండి


గంగవరం సమీపంలో రోడ్డు పక్కనే దర్శనమిస్తున్న చెత్త


రెడ్డినగర్ సమీపంలో రోడ్డు పక్కనే మాంసం వ్యర్థాలు


ఎర్రవాగులో వ్యర్థాలు

తోకపల్లి డీలర్‌పై 6ఏ కేసు నమోదు

పెద్దారవీడు: మండల పరిధిలోని తోకపల్లి రేషన్ షాపు డీలర్ ఉప్పలపాటి నాసరయ్య వద్ద తెల్లకార్డుల లబ్ధిదారులకు సరిపడా రేషన్ సరుకుల కంటే తక్కువగా ఉండటంతో 6ఏ కేసు నమోదు చేసినట్లు ఆర్ఐ గోపి మంగళవారం తెలిపారు. తనిఖీల్లో భాగంగా రేషన్ షాపులో బియ్యం 2,684 కేజీలు, కందిపప్పు 56 కేజీలు తక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విషయాలపై తహసీల్దార్‌కు పూర్తి సమాచారంతో నివేదిక అందజేశామని చెప్పారు.

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం


గ్రామసభలో మాట్లాడుతున్న డీటీ కిరణ్

పుల్లలచెరువు: రీ సర్వేలో భాగంగా వచ్చిన భూసమస్యలను పరిష్కరించుకునేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ తెలిపారు. మంగళవారం మండలంలోని కవలకుంట్ల సచివాలయ పరిధిలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ రైతులతో మాట్లాడుతూ రీ సర్వేలో భాగంగా వచ్చిన భూసమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం గ్రామసభలు ఏర్పాటు చేసిందని తెలిపారు. సమస్యలున్న రైతులంతా అర్జీలు ఇస్తే వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ గ్రామంలో రీ సర్వే జరిపిన తర్వాత రైతుల పొలాల్లో వ్యత్యాసాలు ఉన్నాయని, సర్వే భూవిస్తీర్ణం తప్పు నమోదు కావడంతో ఇబ్బందులు పడుతున్నామని, రైతులు ఎటువంటి క్రయ, విక్రయాలు నిర్వహించుకోలేకపోతున్నారని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. వీఆర్వో వాసు, సర్వేయర్లు నాయక్, రాజ్‌కుమార్, సర్పంచ్ వెంకటరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా నాగుల చవితి వేడుకలు


పుల్లల చెరువు: ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


పెద్దారవీడు: తోకపల్లిలో నాగమయ్య విగ్రహాలకు పూజలు


ముండ్లమూరు: నాగేంద్రస్వామి పుట్టకు పూజలు చేస్తున్న మహిళలు

దొనకొండ: నాగుల చవితి సందర్భంగా స్థానిక ఆనంద ఆశ్రమంలో మంగళవారం నాగేంద్రస్వామికి పంచామృత అభిషేకాలు, అష్టోత్తర శత నామావళి, విశేష పూజలు నిర్వహించి చవితి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పురోహితులు మణిబాబు శర్మ తీర్థ ప్రసాదాలు అందించారు. కురిచేడు గ్రామానికి చెందిన గోపాలుని సుబ్బారావు, లక్ష్మీపార్వతి దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొని విచ్చేసిన భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. భైరవానంద స్వామి భక్తులకు అన్ని వసతులు సమకూర్చారు.

పుల్లలచెరువు: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం కార్తీక మాసంలో వచ్చే చవితిని నాగుల చవితి పర్వదినంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని శ్రీ చౌటపల్లి ప్రసన్నాంజనేస్వామి దేవాలయంలో నాగులచవితి పర్వదినం సందర్భంగా నాగేంద్రస్వామి వారికి పంచామృతాలతో అభిషేకం, పూజా కార్యక్రమాలు పూజారి ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయం వద్ద ఉన్న నాగేంద్రస్వామి పుట్టలో పాలు పోసి చల్లంగ చూడమ్మా నాగమ్మా తల్లీ.. అని ప్రార్థిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెద్దారవీడు: నాగులచవితి పండగ సందర్భంగా మండలంలో తోకపల్లి పుట్ట శ్రీనాగేంద్రస్వామి, ఎస్.కొత్తపల్లి గ్రామాల్లో శ్రీనాగాంజనేయస్వామి పుట్టకు భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాసంలో నాగులచవితి పండగ రావడంతో నామయ్య, పుట్టకు మహిళలు పసుపు, కుంకుమ పండ్లు, పాలు సమర్పించారు. తోకపల్లిలో అర్చకులు భవానీ ప్రసాద్ ఆధ్వర్యంలో నాగమయ్య విగ్రహాలకు పట్టువస్త్రాలు, పూలమాలతో అలంకరించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో నాగయ్య, పుట్టను దర్శించుకుని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. సాయంత్రం ట్రాక్టర్‌పై స్వామి వారి చిత్రపటాలకు పూలమాలతో అలంకరించి గ్రామంలో భక్తులు భజన చేసుకుంటూ భక్తిపాటలు పాడుకుంటూ మేళతాళాలతో ఊరేగింపు చేశారు. మహిళలు స్వామి వారు ఇంటి ముందుకు రాగానే మహిళలు నీటి బిందెతో వారుపోసి కాయకర్పూరం సమర్పించారు. ఆలయం ప్రాంగణంలో భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

ముండ్లమూరు (దర్శి): దర్శి నియోజకవర్గంలో నాగులచవితి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. దర్శి పట్టణంలోని పొదిలి రోడ్డు నాగేంద్ర స్వామి పుట్ట, అద్దంకి రోడ్డు ఎస్ఎస్‌పీ కాలనీ పుట్టలకు భక్తులు పూజలు చేశారు. నాగేంద్ర స్వామికి పాలు పోసి సలిబిండి ప్రసాదాలు నివేదన చేశారు.

ముండ్లమూరులో..

నాగేంద్రస్వామి పుట్టకు పుసుపు కుంకుమలతో మహిళా భక్తులు పూజలు చేశారు. పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. నాగేంద్ర స్వామి వారికి హారతులు ఇచ్చి తమ భక్తిని చాటుకున్నారు.

104 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి


డాక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న 104 సిబ్బంది

దొనకొండ: తమ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దొనకొండ మండలం 104 సిబ్బంది స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.సునీతకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా 104 సిబ్బంది మాట్లాడుతూ తమకు 3 నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, కుటుంబాలు పోషించటం కష్టంగా ఉందని వైద్యాధికారి ఎదుట వాపోయారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా కేవలం రూ.50 వేల ఖర్చుతో నిర్వహించి ప్రజాధనం వృథా కాకుండా చూడాలని, 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్లు మరియు డీఈఓకు జీఓ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, అరవిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ తిరిగి చెల్లించాలని, 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయాలని, సీనియర్ డ్రైవర్లను కాంట్రాక్ట్‌లో పెట్టాలని, ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చేయాలని, ఇతర బకాయిలు చెల్లించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. 104 పైలట్ సుభానీ, డీఈఓ ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ చదువుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీదేవి

దొనకొండ: అక్షరం అనేది ప్రతి మనిషికి వెలుగు ఇస్తోందని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలని, చదువుకుంటే మంచి జ్ఞానం అభివృద్ధి చెందుతుందని, అంతే కాకుండా మహిళలు వారి కుటుంబాన్ని జాగ్రత్తగా నడుపుకుంటారని, తద్వారా ఆర్థికంగా ఎదుగుతారని ఎంపీడీఓ ఎం.శ్రీదేవి తెలిపారు. స్థానిక మహిళా సమైఖ్య కార్యాలయంలో మంగళవారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం ఏపీఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీఓ హాజరై మాట్లాడారు. మొదటి విడతగా మూడు పంచాయతీల్లో ఆరవల్లిపాడు, పెద్దనపాలెం, ఎస్ఎస్‌పల్లి, పోలేపల్లి, రామిరెడ్డిపల్లి గ్రామాల్లో మహిళలు డ్వాక్రా గ్రూపులో ఉండి 1087 మంది చదువుకోనట్లు గుర్తించామని చెప్పారు. ప్రతి 10 మంది మహిళలకు ఒక వలంటీర్‌ను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇస్తారని తెలిపారు. మహిళలు రోజూ 2 గంటలు చొప్పున చదువు నేర్చుకోవాలని, వచ్చే మార్చికి అందరికీ పరీక్షలు నిర్వహించి అక్షరాస్యులకు సర్టిఫికెట్లు మంజూరు చేస్తామని ఎంపీడీఓ తెలిపారు. మండల సమైఖ్య అధ్యక్షురాలు లలిని వైలెట్, సీసీలు, వీఓఏలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

బూత్‌స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం


మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

దొనకొండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బూత్ స్థాయి అధికారులతో తహసీల్దార్ రమాదేవి సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు బూత్ స్థాయి అధికారులకు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. 47 మంది బూత్ స్థాయి అధికారులు నవంబర్ 9, 10వ తేదీలు, 23, 24 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ డేస్‌లో బీఎల్ఓలు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండాలన్నారు. స్పెషల్ క్యాంపెయిన్ డేస్‌లో హాజరైనప్పుడు డ్రాఫ్ట్ ఓటర్స్ లిస్ట్ ఫారం 6, 7, 8 దరఖాస్తులను బీఎల్ఓ రిజిస్టర్‌లతో సహా హాజరు కావాలని చెప్పారు. ఆ రోజు అర్హత ఉన్న అభ్యర్థుల నుంచి ఓటు చేర్చుకునేందుకు ఫారం–6, చనిపోయిన లేదా శాశ్వతంగా వలస వెళ్లిన వారికి ఫారం–7, మార్పుల బదిలీ కోసం ఫారం–8 తీసుకుని సాయంత్ర 4 గంటల్లోపు కార్యాలయానికి తెలియజేయాలన్నారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా సమావేశానికి హాజరు కావాలని తహసీల్దార్ కోరారు.

బెల్ట్ షాపుపై దాడి

- 44 మద్యం బాటిళ్లు స్వాధీనం



ముండ్లమూరు(దర్శి): మండలంలోని బొప్పూడివారి పాలెం గ్రామంలో బెల్ట్‌షాప్‌పై దాడి చేసి వల్లపునేని కృష్ణమూర్తి అనే వ్యక్తి వద్ద నుంచి 44 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. కృష్ణమూర్తి బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. బెల్టుషాపులు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రమణారావుకు జీవిత సాఫల్య పురస్కారం


రమణారావును సన్మానిస్తున్న సంస్థ ప్రతినిధులు

కురిచేడు: విశ్రాంత ఉపాధ్యాయుడు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ వీవీ రమణారావుకు వివేకానంద జీవిత సాఫల్య పురస్కారం లభించింది. విజయవాడకు చెందిన తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఈ పురస్కారాన్ని అందించింది. రమణారావులోని ప్రతిభను గుర్తించి ఈ పురస్కారాన్ని అందించినట్లు సంస్థ నిర్వహకులు డాక్టర్ యూవీ రత్నం తెలిపారు. సంగీతం, సాహిత్యం, కళలు, సేవారంగానికి చేస్తున్న కృషికి గుర్తింపుగా పురస్కారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. రమణారావును ప్రశంసపత్రం, జ్ఞాపికతో సత్కరించారు. విశ్రాంత ఏఎస్‌పీ డాక్టర్ మురళీకృష్ణ, తంబళ్లపల్లి రమాదేవి పాల్గొన్నారు.

వరిలో జాగ్రత్తలతో అధిక దిగుబడులు


డ్రోన్‌తో మందు కొట్టే విధానాన్ని వివరిస్తున్న ఏఓ

పుల్లలచెరువు: వరి పంటలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి నిర్మలాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని ఐటీ వరం, చౌటపాచర్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ గ్రామల్లో సాగర్ కాలువ కింద వేసిన వరి పంటలను ఏవో పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. ఏవో మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటలో ఆకు ముడత పురుగు ఎక్కువగా కనిపిస్తోందన్నారు. దీంతో పాటు వరి పంట దుబ్బు దశలోనూ, ఈనే దశలో ఉందన్నారు. నత్రజని ఎరువుల వాడకం అధికమైనప్పుడు పురుగు ఉధృతి పెరుగుతుందని, దీని నివారణకు వేప కషాయాన్ని పిచికారీ చేయాలన్నారు. తగు జాగ్రత్తలు తీసుకుంటే మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని, రైతులు ఎప్పటికప్పుడు అధికారుల సూచనలు పాటిస్తూ మందులు, ఎరువులు వాడాలన్నారు. ఏపీఎంఐ అధికారి శ్రీరామయ్య మాట్లాడుతూ డ్రిప్ పరకరాలు 90 శాతం రాయితీపై అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీటీసీ పి.గోవింద్, సిబ్బంది శ్రీనివాస్, వసంత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

చిరుధాన్యలు సాగు చేయాలి

దొనకొండ: రైతులు తమ పొలాల్లో పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలు సాగు చేయాలని దర్శి వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ సంచాలకులు కె.బాలాజీనాయక్ సూచించారు. మండలంలోని ఇండ్లచెరువులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు కొన్ని సూచనలు, సలహాలందించారు. రైతులు చిరుధాన్యాలు సాగు చేసుకుని అధిక దిగుబడులు పొందాలని, అదే విధంగా పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని, పశువులకు మేత సమస్య ఉండదన్నారు. వాతావరణం మార్పులతో దిగుబడి తగ్గితే పంట బీమా వర్తిస్తుందన్నారు. సాగు చేసే సమయంలో వేపనూనె, వేప పిట్టు వాడితే పురుగు రాకుండా అడ్డుకోవచ్చన్నారు. ఏఓ ఎస్.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కందిలో ఎర్రి తెగులు రాకుండా ఇప్పుడే మందు పిచికారీ చేయాలన్నారు. పత్తి పంటలో గులాబీ రంగు సోకకుండా లింగాకర్షణ బుట్టలు వాడాలన్నారు. మిరపలో తెల్లదోమ, తామర సోకకుండా పసుపు, నీలం రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేయాలని రైతులకు సూచించారు. అనంతరం సాగులో ఉన్న ఆముదం, పత్తి, కంది, మిరప, పొగాకు పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

దర్శి: రైతులు వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని ఏఓ బాలకృష్ణ నాయక్ సూచించారు. మండలంలోని పాతకమూరు, తూర్పు వీరాయపాలెం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ రైతులందరూ వ్యవసాయశాఖ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖలో అవలంబిస్తున్న పథకాలు గురించి అవగాహన కల్పించారు. చీడపీడలు, తెగుళ్ల గురించి వివరించారు. తమ పంటలు నమోదు చేసుకుంటేనే మార్కెట్‌లో గిట్టుబాటు ధరలకు అమ్ముకోవడానికి ఇబ్బందులు ఉండవని, పంట నష్టపోతే ఇన్సూరెన్స్‌లు వర్తిస్తాయని చెప్పారు. రబీ కాలంలో పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు సాగు చేయాలన్నారు. డ్రోన్‌లతో మందు కొట్టే విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జి.మనోహర్, రైతులు పాల్గొన్నారు.